
**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**

"రామ్మూర్తిగారూ మీకు ఫోన్ వచ్చిందండీ."

ప్యూన్ మాటలకి 'ఎక్కడున్నించబ్బా' అని ఆశ్చర్యపోతూ ఫోన్ దగ్గరి కెళ్ళాడు.

# పేక మేడలు

## సింహప్రసాద్



"హలో రామ్మూర్తిగారేనా? నేనండీ మీ ఎదురింటి గుర్నాథాన్ని మాట్లాడుతున్నాను ..."

"ఏమండీ...."

"ఏం లేదు మీరు అర్జంటుగా రావాలి. మీ భార్య ..."

"ఏమయిందండీ?"

"ఏం లేదు_ కంగారు పడకండి...మరేమో ఆవిడ ఆత్మహత్య చేసుకున్నారు."

"ఆఁ....మీరు చెప్పింది నిజమేనా గుర్నాథంగారూ ??"

"నిజమేనండీ. మీరు వెంటనేవస్తే...."

"ఇప్పుడే వచ్చేస్తున్నా."

ప్రక్కనే వుండి ఫోన్ సంభాషణవిన్న టెలిఫోన్ ఆపరేటర్ "మీ మిస్సెస్ ఆత్మహత్య చేసుకున్నారా?" అన్నాడు యమా ఆశ్చర్యంగా.

పొంగివస్తోన్న కన్నీటి కెరటాన్ని అతి కష్టంమీద నిగ్రహించుకో ప్రయత్నిస్తూ తలూపాడు.

క్షణంలో వార్త ఆఫీసు నలుమూలలకీ ప్రాకింది. అంతా వచ్చి సానుభూతి వాక్యాలు చెప్పసాగారు.

"మీ భార్యా భర్తలెప్పుడూ ఎంతో అన్యోన్యంగా వుంటారని విన్నాం. ఎన్నడూ చిన్న కీచులాట వొచ్చినట్లుకూడా విన్లేదు. పైగా మీరు మంచివారు దురలవాట్లు లేనివారూనూ. మరెందుకు ఆత్మహత్య చేసుకున్నారంటారు?"

"అదే తెలీడం లేదండీ" గద్గదికంగా అన్నాడు.

"ముందు ఇంటి కెళ్దాం పద రామ్మూర్తీ" రామ్మూర్తితో కాస్త సన్నిహితంగా వుండే గోపాలరావన్నాడు.

"ముందు మిగతా కార్యక్రమాన్ని త్వరగా తెమిల్చెయ్యండి. వ్యవహారం పోలీసుల దాకావెళ్తే మాత్రం నాకు ఫోన్ చెయ్యండి. పెద్ద గొడవకాకుండా చూడమని సర్కిల్‌కి చెబుతాను" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కి స్నేహితుడైన ఆఫీసర్.

పోలీసు మాట చెవినబడేసరికి రామ్మూర్తి గుండెలు గుభిల్లుమన్నాయ్.

ఇన్నాళ్ళూ ఎంతో పరువుగా మర్యాదగా బ్రతికిన తనివాళ....

దుఃఖం పొంగి వచ్చింది.

యాంత్రికంగా కదిలి వెళ్ళి గోపాలరావుతోబాటు ఆటో ఎక్కాడు.

"ఇవాళేమైనా పోట్లాడుకున్నారా రామ్మూర్తీ" ఆటో కదిలేక అడిగాడు గోపాలరావు.

"అబ్బే అలాటిదేం లేదు...." అని జవాబిచ్చి ఆవాళ వుదయం నుంచీ జరిగిన సంఘటనలన్నీ మననం చేసుకున్నాడు.

రోజూలానే ఆవాళా సుజాత వుదయమే




లేచి స్నానాదులు ముగించి పూజ చేసుకుని తనని లేపింది. తను బాత్‌రూం నుంచొచ్చే సరికి పిల్లలిద్దరూ టిఫిన్లు తింటున్నారు.

మూడవ తరగతి చదువుతోన్న లలితనీ ఒకటో తరగతి చదువుతోన్న ప్రవీణ్‌ని పలకరించి వాళ్ళ చదువుల సంగతి కనుక్కుంటూ కాఫీ త్రాగాడు. వాళ్ళు బడి కెళ్ళాక పేపర్ చదివి స్నానాదులు ముగించి భోజనానికి కూర్చున్నాడు.

సుజాతకెంతో ఇష్టమైన కందిపప్పు టొమాటో కూర వండినందుకు "ఏమిటోయ్ నీ కిష్టమైన కూరేగాని మా కిష్టమైన కూర వండకూడదా?" అన్నాడు సరదాగా.

"అయ్యో బావోలేదాండీ? దొండకాయ వేపుడేద్దామనుకున్నానుగాని పప్పు వుడి కే సరికి చాలా టైమ్ పట్టింది...." నొచ్చుకుంటూ అంది.

"ఫర్లేదు లేవోయ్ సరదాకన్నాన్లే"

భోజనం ముగించి ఆఫీసుకెళ్ళడానికి తయారవుతోంటే "ఇవాళ కాస్త పెందరాళే రండీ" చాకొక్కబొత్తాములు పెడ్తూ గోముగా అంది.

"అలాగే లే."

"అలాగే అంటేకాదు, ఆఫీసవగానే తిన్నగా ఇంటికొచ్చేయాలి."

"ఇంటికిరాక నేనెక్కడైనా షికార్లు కొడుతున్నానా పేకాడుతున్నానా?"

"అదికాదండీ—."

"ఇంకచాల్లే! మీ ఆడవాళ్ళకి బుద్ధిగా వుండే మగాళ్ళంటే లోకువ. ఆఫీసయ్యాక క్లబ్బుల్లోనూ బార్లలోనూ గడిపి ఏ అర్ధ రాత్రివేళో కొంపకి చేరేవాళ్ళే మీకు తగిన వాళ్ళు" విసుగ్గా అన్నాడు. ఎన్నడూ లేనిది కాస్త కోపంరాగా.

సుజాత మౌనంగా వుండిపోయింది.

రోజూలా వెళ్తున్నానని చెప్పకుండా ఆమె బుగ్గమీద తన పెదాల ముద్ర వెయ్యకుండా విసురుగా బయటికి నడిచాడు.

గుమ్మం దాటి పదడుగులు వేశాడో లేదో "టిఫిన్ బాక్సు మరచిపోయారండీ" అని కేక పెట్టింది.

ఎదురింటి ముందు మగాళ్ళుండగా ఆమె అలా అరచినందుకు మరికాస్త కోపం వచ్చి, "వీధిలో కొచ్చి గాడిదలా అరవాలేమిటి?" అనికోప్పడి ఆమె సమాధానం విన్పించుకోకుండా టిఫిన్ బాక్సు అందుకునొచ్చేశాడు.

తర్వాత అకారణంగా ఆమె మీద కోప్పడినందుకు, విసుక్కుని నొప్పించినందుకు ఎంతో బాధ పడ్డాడు కూడా.

సాయంత్రం ఇంటికెళ్ళేటప్పుడు ఆమె కెంతో ఇష్టమైన సన్నజాజులు కొనుక్కెళ్ళాలనుకున్నాడు కూడా. కానింతలో....

అసలు సుజాతెందుకు ఆత్మహత్య చేసు

కున్నట్టు?

ఎన్నడూ లేనిదివాళ కోప్పడ్డందుకా? ఛా—ఆ మాత్రానికే ఆత్మహత్య చేసుకునేంత బలహీనురాలూ, ఆవేశపురాలూ కాదే. మరెందుకు చేసుకునుంటుంది? అసలు ఆత్మహత్య చేసుకోవాల్సి నన్ని కష్టాలూ నష్టాలూ, బాధలూ, వేదనలూ, హింసలూ, వ్యసనాలూ ఏమున్నాయని?

కారణాలేవీ అంతుబట్టలేదు!

కళ్ళు తుడుచుకున్నాడు కర్చీఫ్‌తో.

"ఊరుకో రామ్మూర్తీ. నువ్వెలాంటి వాడివో మా కందరికీ తెలుసు. నీలోగాని. నీ శ్రీమతిలోగాని కాగడాపెట్టి వెదికినా లోపాలు కన్పించవు. మరీ ఘోరాని కెందుకు తలపడిందో ఏవిటో....పైగా ఆవిడ చిన్నపిల్లకూడా కాదు, ఏదో తొందర పడిందనుకోవడానికి. ఇద్దరు పిల్లల తల్లామె!"

గోపాలరావు మాటలకి పిల్లల దీన మొఖాలు కళ్ళముందు కదలగా బావురు మన్నాడు రామ్మూర్తి. అతడ్ని ఓదారుస్తొంటే ఆటో ఆగింది.

ఇంటి ముందూ, ప్రక్కిళ్ళముందూ, ఎదురిళ్ళముందూ జనం.

గుర్నాథం ముందుకొచ్చాడు రండంటూ.

ఒక్కసారి తలెత్తి చుట్టూ చూశాడు రామ్మూర్తి. అంతా తనవంకే చూస్తున్నారు. నిన్నటివరకూ తననెంతో బుద్ధిమంతుడనీ తనపనీ, తనలోకం తప్ప వేరేమీ పట్టించుకోడనీ, మొగుడూ పెళ్ళాలెంతో అన్యోన్యంగా కాపురం చేస్తారనీ ఎన్నెన్నో ప్రశంసలు పలికిన నోళ్ళు, అభినందన పూర్వకంగా చూసిన కళ్ళు ఇవాళ అనుమానంగా అవహేళనగా హంతకుడ్ని చూసినట్టుగా చూస్తున్నాయ్! ఎన్నో వ్యాఖ్యానాలు చేస్తున్నాయ్!

తలొంచుకుని లోపలికి నడిచాడు.

## స్వపరిచయం



నా కథకి బుల్లి బహుమతి నిచ్చిన ఆంధ్రజ్యోతి సంపాదకులకు కృతజ్ఞుణ్ని.

వివిధ వార, మాస పత్రికలలో ప్రచురింపబడిన సుమారు అరవై కథలూ, అయిదు నవలల ద్వారా పాఠకులకి పరిచితుడనే. నాలుగు నవలలు పుస్తక రూపంలో వచ్చాయి. కొన్ని నాటికలు ప్రదర్శింపబడ్డాయి. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఆంధ్రజ్యోతి వీక్లీ (నవలా ప్రియదర్శిని), జ్యోతి మంత్లీ నవలల పోటీల్లోనూ, యువ, చక్రవర్తి, విశ్వరచన, వంశీఆర్ట్స్ వారి కథల పోటీల్లోను బహుమతులొచ్చాయి.

ప్రస్తుతం ఇండియన్ బ్యాంకు నుంచి డెప్యుటేషన్ మీద శ్రీ వేంకటేశ్వరా గ్రామీణ బ్యాంకు, ఎర్రావారిపాలెం బ్రాంచి మేనేజరుగా పని చేస్తున్నాను.

—సింహప్రసాద్

గదిలో మంచం మీద వులుకూ, పలుకూ లేకుండా పడివుంది సుజాత. ఒంగి ఆమె చల్లని చేయి పట్టుకుని బావురుమన్నాడు రామ్మూర్తి.

వూరుకోమంటూ ఓదార్చి నిద్ర మాత్రలు మింగిందంటూ చీటీ తెచ్చి చూపించారు. పని మనిషికా చీటీ ఇచ్చి మాత్రలు తెప్పించుకుందట. అంట్లు తోమడం పూర్తిచేసి పనిమనిషి వెళ్ళిపోయిందట. తర్వాత పిల్లలు స్కూలు నుండొచ్చి ఎంత పిలిచినా పలకలేదుట. ఇరుగు పొరుగు వచ్చి తలుపులుతీసి చూసేసరికి ఆవిడ పడుకుని వుందట. దగ్గరికెళ్ళి చూసేసరికి ఆమె పోయింది.

ఓ ప్రక్కన వెక్కివెక్కి ఏడుస్తోన్న పిల్లలొచ్చి తండ్రిని చుట్టేసి గొల్లుమన్నారు. గోపాలరావు ముందుకొచ్చి పిల్లల్ని తీసుకెళ్ళాడు.

నిశ్చింతగా దీర్ఘనిద్రపోతోన్న భార్య వంక ఆవేదనగా చూశాడు.

దగ్గర దగ్గర నాలుగేళ్ళ క్రితం తన జీవితంలో ప్రవేశించిన సుజాత కలతకీ, కన్నీళ్ళకీ తావులేని విధంగా సంసారంచేసి ఇవాళ సరైన కారణం లేకుండా తనువు చాలించి తన మానాన తను వెళ్ళిపోయింది. తనని అవమానాల అగ్నిగుండంలోకి త్రోసేసి మరీ వెళ్ళిపోయింది!

ఎందుకిలాటి పనిచేశావు సుజాతా? ఏం జరక్కూడనిది జరిగిందని ఇంత తీవ్ర నిర్ణయాని కొచ్చావు? నేనూ పిల్లలూ ఏమై పోవాలనుకున్నావు సుజాతా?

దుఃఖం పెల్లుబికి రాసాగింది రామ్మూర్తికి.

"ఉత్తరం ఏమైనా రాసిపెట్టిందా?" ప్రక్కింటి నడి వయస్సావిడడిగింది కుతూహలంగా.


"రాసినట్టు లేదండీ. అన్నీ వెదికాం. ఎక్కడా ఏం కన్పించలేదు" గుర్నాథం అన్నాడు.

"అసలెందుకు సూయిసైడ్ చేసుకుందంటారు మాస్టారూ?" ఒక పెద్ద మనిషడిగాడు గుమ్మంలో నిలబడి లోపలికి తల దూరుస్తూ.

"అదే తెలీలేదండీ. రామ్మూర్తిగారేం జరగలేదంటున్నారు."

"ఏం జరక్కపోతే ప్రాణత్యాగం ఎందుకు చేస్తాది లెండి. మనకి తెలీని పెద్ద కారణమేదో వుండే వుంటుంది" ఎవరో అన్నారు.

"ఇవాళ ప్రొద్దున చూసినప్పుడే అనుకున్నానండి సుజాత అదోలా వుందేమిటీ అని. ఇంతలో ఇంత అఘాయిత్యం చేస్తుందని కలలో కూడా అనుకోలేదండి" అని ఇరుగమ్మ కళ్ళు తుడుచుకుంటే.



"చీమకి కూడా అపకారం తలపెట్టని మనిషమ్మ. ఇంత ఘోరానికి తలపడిందంటే ఎంత కష్టమొచ్చిందో సుజాతమ్మకి" అంది పొరుగమ్మ బాధగా.

ఇంతలో పోలీసు లొచ్చారు. పోలీసు లొచ్చారన్నారంతా కంగారుగా.

అదిరిపడ్డాడు రామ్మూర్తి!

అర్ధాంగి చనిపోయిందనో ప్రక్కనుంగిపోతోంటే పోలీసు కేసొకటికాబోలు! భగవంతుడా ఎంతకర్మ తెచ్చిపెట్టేవయ్యా!

నిట్టూర్చి కళ్ళు తుడుచుకుంటూ లేచాడు రామ్మూర్తి.

యస్సై, కానిస్టేబుల్సు, ఫొటోగ్రాఫర్ వచ్చారు. ఫొటోలు తీసుకున్నాక "మీరేనా ఆవిడభర్త?" అని అడిగాడు యస్సై రామ్మూర్తిని.

తలూపాడతడు.

"మీ రెక్కడ పని చేస్తున్నారు?"

చెప్పేడు.

"ఐసీ. ఆమె ఎందుకు సూయిసైడ్ చేసుకున్నారో మీకేమైనా తెలుసా?"

"తెలీదండి. అసలు సూయిసైడ్ చేసుకోవల్సిన అగత్యమేమిటో బోధపడటం లేదండి."

"అంటే ఎవరైనా హత్య చేసి వుంటారని మీ అనుమానమా?"

"అబ్బే అదేం కాదండి...." ఇంకెలా చెప్పాలో తెలీక ఆగిపోయాడు.

"మీ సంసారం సాఫీగా నడిచేదా లేక..?"

"ఎన్నడూ గట్టిగా మాట్లాడుకోవడం కూడా మేం విన్లేదండి" అన్నారు మధ్యలో కల్పించుకుంటూ గుర్నాథం.

"అతన్ని చెప్పనివ్వండి."

"మేం చాలా అన్యోన్యంగా కాపురం చేశామండి."

"పెళ్లై ఎన్నాళ్ళయ్యింది? పిల్లలా?"

"ఇద్దరు పిల్లలండి. పెళ్లై నాలుగేళ్ళు కావస్తోందండి."

"కొంచెం నిదానంగా ఆలోచించి చెప్పండి రామ్మూర్తిగారూ. ఇవాళ మీరూ, మీ భార్యా ఏమైనా తగవులాడుకున్నారా?"

"లేదండి" అన్నాడు. మళ్ళీ అంతలోనే ఏమనుకున్నాడో ఉదయం తను కోప్పడటం గురించి చెప్పేడు.

"కోప్పడటమేనా చెయ్యి కూడా చేసుకున్నారా?"

"అబ్బే- అలాటిదేం లేదండి."

"సరే శవాన్ని పోస్టుమార్టమ్‌కి తీసుకెళ్తాం. మీరోసారి స్టేషన్‌కి రావాల్సుంటుంది."

తలాడించాడతను.

ఇంతలో పనిమనిషి రావడంతో ఆవిడ్నో ప్రక్కకి తీసుకెళ్ళి "ఇవాళ నువ్వు నిద్ర




మాత్రలు తెచ్చిచ్చేవా?" అని ప్రశ్నించాడు యస్సై.

"ఒంట్లో బాగోనేదూ ఏవో మాత్రలు తెమ్మని చీటీ యిచ్చేరండి. తెచ్చేనండి."

"ఎన్ని తెచ్చావు?"

"రెండండి."

"ఇదివరకెప్పుడైనా అలాటివి తెచ్చావా?"

"నెలకోమాటో, రెండు మాట్లో తెచ్చేదాన్నండి. ఆరికి పెద్ద నొప్పి వత్తా వుంటాదండి, అప్పుడు తెమ్మంటారండి."

"ఆ వంకన తెప్పించుకున్నవన్నీ దాచి ఇవాళొక్కసారే మ్రింగేసుంటుందండి" ప్రక్కనేవున్న ఎవరో వ్యాఖ్యానించారు.

తల పంకించాడు యస్సై.

పోస్టుమార్టమ్ పూర్తయ్యాక శవాన్నిచ్చేశారు.

అంతక్రితమే సుజాత అన్నదమ్ములకీ తన బావకీ టెలిగ్రాములు యిప్పించాడు గోపాలరావుచేత. అయినా వాళ్ళొచ్చేవరకూ శవాన్నలా వుంచడం మంచిది కాదని సలహా ఇవ్వడంతో మునిసిపాలిటీ వారి శ్మశానంలో దహనం చేశాడు రామ్మూర్తి.

అవాళ్టి వుదయం వరకు నవ్వుతూ తుళ్ళుతూవున్న సుజాతని, అసిన్ని కాన్నై మహాలక్ష్మిలా మెలగిన సుజాతని గుండె రాయిచేసుకుని గుప్పెడు బూడిదచేసి వచ్చేశాడు.

బోసిగా బావురుమంటూవున్న ఇంట్లో అడుగుపెడుతూంటే దుఃఖం కట్టలు త్రెంచుకుందతడికి. అతడ్ని వాటేసుకుని పిల్లలు ఏడ్చేశారు.

ఇరుగు పొరుగువచ్చి ఓదార్చారు. ఎంతో సానుభూతి ప్రదర్శించారు. అసలెలా చనిపోయిందంటూ వచ్చి అడుగుతోన్నవాళ్ళకి కథలుగా చెబుతున్నారు. క్రొత్త క్రొత్త వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

మెల్లగా సుజాత ఎంతో మంచిదిగానూ రామ్మూర్తి దుష్టుడిగానూ వారి మాటల్లో రూపుదిద్దుకుంటున్నారు!

రామ్మూర్తి పైకి బుద్ధిమంతుళ్ళా కన్పించినా వట్టి అనుమానపు మనిషనీ, భార్యని మౌనంగా హింసించేవాడనీ ఒకామె రసవత్తరంగా వర్ణిస్తోంది. అబ్బెబ్బే అదేం కాదు. అతడు పరమలోభి, ప్రతి దానికీ భార్యని పీక్కుతినేవాడు, ఆ బాధలు పడలేక ఆత్మహత్య చేసుకుందని బల్లగుద్ది చెప్పింది ఒకావిడ. అదీ ఇదీ కాదుగాని రామ్మూర్తి ఆఫీసులోని ఒకావిడతో తిరుగుతోన్నందున సహించలేక ఈ పనికి పూనుకుందని మహాకాయన అథార్టీగా చెప్పినట్లు చెప్పాడు.

అన్నీ రామ్మూర్తి చెవిని పడుతూనే వున్నాయ్. మనస్సుని గాయపరుస్తూనే వున్నాయ్.

తను తప్పు చేసినా, చెయ్యకపోయినా ప్రస్తుతం తను దోషిగనుక మౌనంగా అన్నీ భరిస్తున్నాడతడు.

సాయంత్రం ప్రక్కింటి వాళ్ళు వండి తెచ్చిన అన్నాన్ని పిల్లలకి పెట్టాడు. అతి కష్టం మీద రెండు ముద్దలు తిని లేచారు వాళ్ళు. రామ్మూర్తికి ఆకలి చచ్చిపోవడంతో దాని జోలికి పోలేదు.

అంతా వెళ్ళిపోయారు. ఏం వర్లేదంటూ ధైర్యం చెప్పి వెళ్ళాడు గోపాలరావు.

పిల్లల్నిద్దరినీ ప్రక్కనేసుకుని పడుకోబెట్టుకున్నాడు రామ్మూర్తి. ఏడుస్తూనే నిద్రపోయారు వాళ్ళు.

రామ్మూర్తికి పొడికళ్ళుపడ్డాయి. కప్పుకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

ప్రొద్దుట్నుంచీ జరిగిన సంఘటనల్ని తలచుకొంటోంటే అవన్నీ జరిగాయనుకొంటోంటే నమ్మబుద్ధి కావట్లేదు. ఎంతలో ఎంత మార్పు! ఎంత ఘోరం!

అసలు సుజాతెందుకీపనికి పూనుకున్నట్టు?

ఆమె లేకపోతే తనూ పిల్లలూ దిక్కులేనివాళ్ళమై పోతామని తెలిసి కూడా ఎందుకా నిర్ణయాని కొచ్చినట్టు?

ఆలోచన అరంగుళంకూడా ముందు కెళ్ళటం లేదు.

తన తోడునీడగా వున్న సుజాత మరి లేదనుకుంటే, ముక్కుపచ్చలారని పిల్లలకి తనే తల్లీ తండ్రీ అవ్వాలని గుర్తు చేసుకొంటోంటే గుండెలు ప్రక్కలవుతున్న బాధ! ఎవరికి చెప్పుకోగలడు? చెప్పుకుంటే మాత్రం నమ్ముతారా? నమ్మరు. నవ్వుతారంతే!

భవిష్యత్తంతా చీకటి క్రమ్మేసినట్లనిపిస్తోంటే నిట్టూర్పులతో గడిపేశాడా రాత్రంతా.

పూర్తిగా తెల్లారకుండానే రామ్మూర్తి

అత్తగారూ, బావమరుదులూ వచ్చారు.

"నాతల్లి నాతల్లో. నాకన్నా ముందే వెళ్ళిపోయావా తల్లీ. నీకెన్ని కష్టాలొచ్చాయే అమ్మా. సుఖపడతావనీ మాయదారి సంబంధం చేస్తే అన్యాయమైపోయావు గదే" అంటూ శోకాలు తీసింది అత్తగారు వస్తూనే.

"అసలిలా ఎలా జరిగింది బావా!" పెద్ద బావమరిది అన్నాడు కాస్త గట్టిగా నేరస్థుణ్ని అతణ్ని చూస్తూ.

రామ్మూర్తి నోరు విప్పకుండానే అతడి అత్తగారంది "కట్నం బాకీ రెండువేలివ్వ లేదని . నా కూతురి గొంతు కోశావ్రా నాయనా. పచ్చగా నూరేళ్ళు బ్రతుకుతుం దనుకున్నానుగాని ఇలా అర్ధాంతరంగా చచ్చిపోతుందనుకోలేమురా దేవుడా."

"నువ్వుండమ్మా. బావని చెప్పనియ్యి" చిన్న బావమరిది కసురుకున్నట్టుగా అన్నాడు.

"ఎన్నడూ మాటా మాటా అనుకుని కూడా ఎరగం. మరెందుకిలాటి పనిచేసిందో అర్థంకావట్లేదు."

రామ్మూర్తి వంక అపనమ్మకంగా చూశారు ముగ్గురూ. ఏమీ లేకుండా- ఏ హింసలూ, ఏ గొడవలూ లేకుండా ఒక నిండు ప్రాణం తీసుకోడానికి సుజాత చిన్న పిల్లా అనుకున్నారు. నోరు తెరిచి చేసిన ఘోరమెలా చెబుతాడ్లే- చెబితే కటకటాలు వెనక కూర్చోవాల్సి వుంటుందని తెలీదూ అనుకున్నారు.

"ఇతగాడికేం, మనమ్మాయి కాకపోతే ఇంకొకత్తె వస్తుంది. కాని పిల్లలకి తల్లి రాదుగా! వాళ్ళ బాగోగులు చూస్తార్రా నాయనా. వాళ్ళనిక్కడే వుంచితే ఇతగాడో ఆ వచ్చే మహాతల్లో ఏమందో పెట్టి నా కూతురికి చేసినట్టే చేస్తార్రా అబ్బాయ్."

అత్తగారి ఆరోపణలకి రామ్మూర్తికి కోపం వచ్చింది. పిల్లలమీద వీళ్ళకే ప్రేమ వున్నట్టూ, తండ్రినైనవాడికి పిల్లలమీద ప్రేమ వుండనట్టూ మాట్లాడుతోందేం అనుకున్నాడు కోపంగా. మరోసారి మరోసారి అయితే ఏదో అనేవాడే. కానిప్పుడంటే ఇంకో కథ పుడుతుంది. తనమీద మరో నాలుగు రాళ్ళు పడతాయి. అంతకు మించి ప్రయోజనముండదని వూరుకున్నాడు.

కాస్త ఎండెక్కేసరికి రామ్మూర్తి అక్కగారూ, బావగారూ వచ్చారు. "అయినింటి ఆడపిల్ల, బుద్ధిగా కాపురం చేస్తోందని మురిసిపోతుంటే ఇదిట్రా అది చేసిన నిర్వాకం! చాలుచాల్లే ఇన్నాళ్ళూ దాన్తో ఎలా వేగేవురా తమ్ముడూ. చూస్తొంటే రాక్షసిలా వుంది. లేకపోతే- హవ్వ హవ్వ మాత్రలు మింగి చస్తుందా? నీ పరువు బజార్లో పెడుతుందా?" అంది వస్తూనే అక్కగారు.

దాంతో రామ్మూర్తి అత్తగారూ, అక్కగారూ మాటామాటా అనుకున్నారు. వంశ చరిత్రలు తిరగవేసుకుని మీరుచెడ్డవాళ్ళంటే మీరు చెడ్డవాళ్ళని దెప్పుకున్నారు. ఆఖర్న వుక్రోషం పట్టలేక కాబోలు రామ్మూర్తి అక్కగారంది: "ఈ మాయదారి గొప్పల కేంలే. ఎవర్తోనో రహస్యంగా తిరిగుతుంది, అది మావాడికంటబడేసరికి మత్తు బిళ్ళలు మింగేసింది!"

"నా కూతురన్నంత మాటంటావా నీ నోట్లో పురుగులుపడ! నీ పుస్తెలు పుటుక్కున తెగ...." అంటూ శాపాలు పెట్ట సాగింది అత్తగారు.

వారి గొడవకి ఇరుగుపొరుగు చేరతొంటే సుదురు పట్టుకుని కూర్చుండిపోయాడు రామ్మూర్తి!

ఆ సాయంత్రం చీకటిపడాక వీధి మలుపులోవున్న కిళ్ళీ బడ్డీ దగ్గరకి సిగరెట్లు కొనుక్కోడానికి వెళ్ళిన రామ్మూర్తి చెవిలో తమ గురించెవరో చెవులు కొరుక్కోంటొంటే వులిక్కిపడ్డాడు. ఆపైన బాధపడి వెనుదిరిగి వచ్చేశాడు.

తను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్నట్టు, అంచేత శీలవతికాని సుజాతకి నెలతప్పేసరికి ఆత్మహత్య చేసుకుందిట. అదీ వాళ్ళ సంభాషణా సారాంశం!

వింటున్నావా సుజాతా? ఇవన్నీ వినడానికి ఈ నరకంలో వూపిరాడక కొట్టుకోవడానికేనా ఆత్మహత్యకి తలపడ్డావ్? నువ్వు తొందరపడి చేసినపని ఫలితం ఏమిటో ఏమాత్రమైనా ఆలోచించి వుంటే ఎంత బావుండేది!- అనుకున్నాడు ఆవేదనగా.

మూడోరోజున చిన్నకర్మ చేశారు. అది అవటంతోనే రామ్మూర్తి అత్తగారూ, బావమరుదులూ వెళ్ళిపోయారు. పిల్లల్ని తీసుకెళ్ళిపోతామన్న వాళ్ళు ఆ వూసే ఎత్తలేదు వెళ్ళేటప్పుడు!

"నువ్వేం ఇదవ్వకురా. జరిగిందేదో జరిగిపోయిందిగానీ, ఏదో వీలైన సంబంధం చూసాన్లే మీ బావగారు" అన్నది రామ్మూర్తితో అతడి అక్కగారు.

"అలాటి ప్రయత్నాలేం చెయ్యొద్దు అక్కయ్యా. ఇప్పటికే విసిగిపోయాను. మనసు విరిగిపోయింది."

"అయితే మాత్రం ఎల్లకాలం ఆదరణ లేకుండా వుండిపోతావుట్రా" బుగ్గలు నొక్కుకుందావిడ.

"జరిగిన అనుభవం చాలక్కా. అలాటి ప్రయత్నాలేం చెయ్యొద్దు" అన్నాడతడు.

"హుం- సరిపోయింది. నువ్విలాటి వాడివిగనుకే ఆవిడలా అర్ధాంతరంగా చచ్చింది!" అని చేతులూ మూతీ తిప్పింది అక్కగారు.

నవ్వుకోకుండా వుండలేకపోయాడతడు.

పోస్టుమార్టమ్ రిపోర్టు రానందున చీటికీ మాటికీ పోలీస్ స్టేషన్‌కి పిలుస్తోంటే వెళ్ళక తప్పటంలేదు రామ్మూర్తికి. తన ఆఫీసర్‌తో సర్కిల్‌కి చెప్పించడమేకాదు, తనూ కొంత సమర్పించుకొంటే తప్ప తిన్నగా వుండనివ్వలేదు వాళ్ళు.

గడప దాటితే చాలు అంతా అతణ్ని అదోలా వింతగా, అనుమానంగా చూస్తూండటంతో బయటికెళ్ళటం తగ్గించేశాడు రామ్మూర్తి. పలకరించడానికొచ్చిన సహోద్యోగులు కూడా తప్పు అతడిదే అని లోపలనుకుంటూ పైకి మొక్కుబడిగా మాట్లాడి వెళ్ళిపోతున్నారు.

ఆకస్మికంగా వచ్చిన ఈ మార్పులు చూస్తోంటే అతడికి మతిపోతోంది. నిరాశా నిర్లిప్తతా అధికమవుతోంది.

అవాళ పోలీస్ స్టేషన్ కెళ్ళిన రామ్మూర్తిని చూడగానే "అదృష్టవంతులు. తేలిగ్గా తప్పించుకున్నారు" అన్నాడు యస్సై.

"ఏమయ్యిందండీ? పోస్టుమార్టమ్ రిపోర్టొచ్చిందాండీ?"

"ఇంతక్రితమే వచ్చిందండీ. మీ రనుమానించినట్టు స్లీపింగ్‌పిల్స్ మ్రింగి ఆత్మహత్య చేసుకోలేదు. సడన్‌గా హార్ట్ ఫెయిలవడంవల్ల చనిపోయిందట!"

"నిజంగానాండీ? థాంక్‌గాడ్."

ఎంతో హాయిగా దూదిపింజకన్నా తేలికైపోయినట్టుగా, గుండెలమీంచి మోయలేని బరువు దింపుకున్నట్టుగా కత్తుల బోనులోంచి తప్పించుకున్నట్టుగా వుందతడికి.

"నేనూ, నా భార్యా నిర్దోషులమే" అని అరవాలనిపించింది.

"థాంక్యూ. వస్తాన్సార్" అని గిరుక్కున వెనుదిరిగి తనపేట కెళ్ళాడు, వార్త నందరికీ పంచి అనుమానాలు పటాపంచలు చెయ్యడానికి.

ముందు గుర్నాథం ఎదురవడంతో మరింత సంబరంతో పిలిచి "పోస్టుమార్టం రిపోర్టొచ్చిందండీ. మీరంతా అనుకున్నట్టు నా మిసెస్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోలేదు. హార్ట్ ఫెయిలవడం వల్ల చనిపోయిందట" అని చెప్పేడు.

అతడు రామ్మూర్తి మొహంలోకోసారి చూసి "డబ్బు పోస్ట్ మార్టం రిపోర్ట్‌లనే కాదు, ఎలాటి నిజాల్నైనా అబద్ధం చేసెయ్యగలదు" అనేసి వెళ్ళిపోయాడు.

మ్రాన్పడి పిచ్చిగా చూస్తుండిపోయాడు నడిరోడ్డు మీద రామ్మూర్తి!